ఈ వారం కథ

# అపర 'ఘటో'త్కచుడు

-చాగంటి కపాలేశ్వరరావు

సంగీతం సంగమయ్యగారి ఏకైక శిష్యుడు, ఏకాంబరానికి ఆంధ్రప్రదేశ్‌లో అనావృష్టి అమిత సంతోషం కలిగించింది. తాను లోగడ గురువుగారిచేత వర్షకారక రాగాలు పాడించి, పలుమార్లు వర్షాలు కురిపించి, అనావృష్టికి పులిస్టాపు పెట్టించాడు. ఒకసారి గురువుగారి రాగప్రభావం డోసెక్కువై అతివృష్టి కూడా దారితీసింది. తక్షణ విరుగుడుగా వరుణుణ్ణి శాసించే వరుణశాసని రాగం పాడండని గురువుగార్ని హెచ్చరించబట్టిగాని, లేకపోతే త్రిలింగ దేశం యావత్తూ బంగాళాఖాతంలో కలిసిపోయుండేది అనడానికి కూడా తెగిస్తుంటాడితడు. ఇప్పుడూ అదే అనావృష్టి విలయ తాండవం. ఇల్లు కాలాక బావి తవ్వడం దూరదృష్టి లేని వాళ్ళు చేసే పని. వర్షాకాలంలో వర్షం తెప్పించే రాగాలూ, అదే అతివృష్టికి కనక దారితీస్తే, ఆ అదనపు వర్షాన్ని అనావృష్టితో అలమటిస్తున్న ఇతర చోట్లకి మళ్ళించేసే రాగాల్ని, ఎప్పటికప్పుడు పాడేస్తుండండీ. మన పేద జనాన్ని ఈ కరువు బారి నుంచి రక్షించడానికి మీ చేతులో, అదే, మీ గాత్రంలో. వున్న పని మీరు చేసేస్తుండండని చెవినిల్లు గట్టుకుని పోరుతూనే ఉన్నాడు.

'వర్షాలు కురిపించడానికి ఎవరికి వారు వరుణ యజ్ఞాలు, సామూహిక మండూక వివాహాలూ, సంగీత రాగ యజ్ఞాలూ, చేసీ, చేయించీ, పేపర్లలో ఫోటోల్తో సహా వార్తలు వేయించేసుకుని కీర్తి శిఖరాలకు ఎగబాకేస్తున్నారు. తానూ, తన గురువుగారూ మాత్రం. ఒక ఫొటో లేదు. వార్త లేదు. అవతలి అవార్డూ, బిరుదూ, పుంఖాను పుంఖాలుగా ఇప్పించేసుకుని విర్రవీగుతున్న వారు, వీధికి ఇద్దరు ముగ్గురుకీ తక్కువ కాకుండా వెలిగిపోతున్నారు. తన గురువుగారికి ఇప్పటివరకూ, అవార్డు గాని, బిరుదు గాని, బోణీయేనా కాలేదు.

ఈసారి మండు వేసవి ఎండ. దానికి తోడు నీటి కరువు. వర్షం దండిగా కురిపించవలసిన టైమిది. లోగడ రెండు మూడు జల్లులు పడితే, ఆ క్రెడిట్ కోసం అప్పుడే గాయకులూ, నాయకులూ పైరవీలు. ఎవరికో అభినవ తాన్‌సేన్‌కో, అపర ముత్తుస్వామి దీక్షితారో, బిరుదో, అవార్డో తగిలించేస్తారు. గురువుగారికి ఇవన్నీ బెఖాతరు. తానే పూనుకుని 'వర్షకర్షి' అనే ఒరిజినల్ బిరుదు తనేనా పుచ్చుకోవాలి. లేదా గురువుగార్కైనా ఇప్పించి తీరాలి. ఇలా ఆలోచించుకుంటూ, ఇటే వెళ్ళి వస్తున్నాడు ఏకం. అన్నట్టు ఏకాంబరం ఎవరో మీకు గాపకం లేదు గాపును. లోగడ ఇతగాడి ప్రతాపం చెప్పే కథలు ఎన్నో మనవి చేశాలెండి. గురువుకి పాఠాలు నేర్పుతాననే శిష్యుడితడు. ప్రపంచ ఖ్యాతి గాంచడం అనేది ఇతగాడి ప్రప్రథమ ప్రయారిటీ. సంగీత సమ్రాట్టనిపించుకోవాలని ఏకం ఏకైక యావ. గురువు, సత్యకాలం సంగమయ్యగారి ఏకైక శిష్యుడితడు. పదేళ్ళయినా సంగీతం నేర్చుకుంటున్నాడు. ఇప్పటికి వర్ణాలు అయ్యాయనిపించి, కృతులు పాఠం చెయ్యడం దాకా వెళ్ళిపొచ్చాడు. ఇంకా నీకు శ్రుతి కలవదు. లయ నిలువదేమిరా? అని గురువుగారు ఎప్పుడూ గొడవే.

గురువమ్మగారి ధర్మమా అని వేపచిగురు ట్రీటుమెంటూ, పచ్చి మిరియం ట్రీటుమెంటూ... అదేమిటంటారా, 'విరిబోణీ' అనే భైరవిరాగ అటతాళ వర్ణం రాసి, ఇప్పటివరకూ ఆ రాగంలో అంతటి రచన చేసినవారు లేరనిపించుకున్న తంజావూరు పచ్చిమిరియం ఆదియప్పయ్యగారి వంశనామం పచ్చిమిరియం. వారింట పచ్చిమిరియం తప్పక వాడేవార్ట అని ప్రసిద్ధి - వగైరాలు చేసి, శ్రుతిని ఏ మాత్రమో లొంగదీసుకోగలిగాడు. 'శ్రుతిర్మాతా' అన్నట్టుగా, మాతృ సమానురాలైన గురువమ్మగారి చలవవల్ల.

తానా, తల్లీ, తండ్రీలేనివాడు. గురువుగారూ, గురువమ్మగారే తల్లిదండ్రుల్లాగా కనిపెట్టుకుని ఉన్నాడు కదా! ఇక 'లయఃపితా' అని పెద్దలు అన్నట్టు, పితాశ్రీ వంటి గురువుగారియెపుడూ, రుసరుసలూ, ధుమధుమలే. ఒక్క మంచి మాట లేదు. సాధించవలసింది బోలెడుందంటాడు. సాధనకి తానెప్పుడూ సిద్ధమేను. సాధింపజెయ్యవలసింది గురువా, తనా? తానా, చెయ్యవలసిన సాధన కంటే ఎక్కువే చేస్తూన్నాడాయె. గురువుగారి కాళ్ళు వత్తడం కూడా. లయ తాళబద్ధంగా, ముక్తాయింపులతో సహా వాయించేస్తూనే ఉన్నాడు. గురువుగారికి తలంటడానికి క్షవరయ్య తయారవబోతుంటే, తాను అడ్డం వెళ్ళి, గురువుగారి బట్టతల మీద మృదంగ విద్యార్థులు వాయించే పాలవరసల దగ్గర్నుంచీ, సప్త తాళాల లోనూ ఆవర్తనాలు వాయించే సన్నాసే ఉన్నాడు. 'ఇహ ఆపవా యేమిట్రా? నీ సాధనకి నా నెత్తే దొరికిందీ? మీ పూర్వీకులిచ్చిన మృదంగం మనింట్లోనే మూలపడి మూలుగుతూ ఉంది. దాని మీద సాధకం చేసుకుని యాడవచ్చుగా?' అని మొత్తుకుంటాడే గాని, తన శ్రద్ధ గురించి ఒక్క మెచ్చుకోలు మాటాడ్డానికి ఆయనకి నోరాడదు. ఇలాంటి గురువుగారితో ఇన్నేళ్ళూ ఎలా వేగాడో? అన్నట్టూ, ఆ వచ్చేవాడెవరూ? తన శిష్యుడు అగ్గిరాముడు కాదూ? ఈ కరువు సహాయ కార్యక్రమాల ప్రచార అవకాశం మన చెయ్యి దాటి పోనివ్వకుండా, తరువాతి అడుగు ఏం వెయ్యాలీ అన్న విషయంలో వీణ్ణే కదిపి చూడాలి, అనుకుంటుండగానే, అగ్గిరాముడూ, 'గురువుగారోయ్. మీకు నిండా నూరేళ్ళాయుష్షు. మీ మాటే అనుకుంటున్నాను. మీరే వెదకబోయిన తీగ లాగ, కాలికి తగిలారు' అన్నాడు.

'కాలికి తగల్డమేమిట్రోయ్. వొళ్ళు దగ్గర పెట్టుకుని మాటాడు' అని గదమాయించాడు, ఏకం.

'వెతక్కుండానే, యెదట తారసపడ్డారని అలా అన్నానండయ్యా. మీరేమో మీ గురువుగార్ని, ఇష్టం వచ్చినట్టు, మాయరోగం అనీ, ఇలా ఎన్నో అనొచ్చుగాని, నేనొక్కమాటంటే తప్పట్టుకుంటున్నారు' అని అగ్గిరాముడు దెప్పిపొడిచాడు. దాంతో, ఏకం, ఈ సందర్భంలో మాటాడ కూరుకోవడమే ఉత్తమం అని గ్రహించి, మాట మారుస్తూ, 'రాష్ట్రంలో కరువు నివారణకు మనం చేయగలిగిన కార్యక్రమం ఏదైనా ఉందంటావా?' అనడిగాడు.

'అందరూ అప్పుడే కార్యక్రమాలు జరిపించేసి పబ్లిసిటీ కొట్టేశాక, ఇపుడడుగుతున్నారా, దొంగ పడ్డ ఆర్నెల్లకి కుక్క మొరిగినట్టు?' అన్నాడు అగ్గిరాముడు.

'అదిగో మళ్ళీ కుక్కంటున్నావ్? ముందు మాట జాగ్రత్త. ఎన్నిసార్లు చెప్పాను?' అని ఏకం.

'అబ్బా, మీరు మీ గురువుగార్ని వారి మొహాన్నే మాడు మొహం అనొచ్చా? పోన్లెండి. మీకు ఆగ్రహం తగ్గాకే అగుపడతాను' అని ముందు కడుగేయబోతున్న అగ్గిరాముణ్ణాపి, 'సర్లేరా, ముందీ కార్యక్రమం సంగతేవిటి, అదాలోచించు. రాగయజ్ఞం చేద్దామంటే, అదపుడే ఎవరోగాని మొదలెట్టియ్యడం, పడ్డ వర్షాలకి క్రెడిటు మాదంటే మాదని పేపర్ల కెక్కడం జరిగేపోయింది. మరోహరెవరో మృదంగం వెయ్యి [illegible] గంటలు సప్త తాళాలూ పంచ గతుల్లో గనక వాయిస్తే, మృదంగ ఘోష వల్ల ఉరుములతో వర్షాలు ఖాయం అన్నారుట. అది చూదామంటావా? లేక నీ అగ్గిపెట్టెల వాద్యం, నా మృదం యుగళ బందీ దడదడ లాడించేద్దామా?' అన్నాడు.

'ఖాళీ అగ్గిపెట్టెలు పది బుట్టలు అలా పడి మూలుగుతున్నాయ్. మీరెప్పుడు మళ్ళీ ముక్కు వీణ కచేరీ తలపెడతారోనన్చెప్పి, నానా కష్టాలూ పడి, కలెక్టు చేసి, జాగ్రత్త పెట్టాను. నాదేం ఆలస్యం లేదు. మీ మృదంగానికా, గుల్ల తప్ప, మిగతా అన్నీ వెతుక్కోవలసిందేను. అంతకంటే, నోటితోనే వెనక రేడియో అన్నయ్యగారు, లేటు న్యాపతి రాఘవరావుగారు నేర్పించగా, మీరూ సాధించారు. నేనూ యెరుగుదును. అగ్గిపెట్టెలూ - నోటి మృందంగం, యుగళ బందీ, అనేద్దాం. మనదంతా స్పెషలే గదా! అసలు మీరేవనుకోనంటే, మీ గురువుగారి బట్టతల మీద సోలో వాయించడానికి ఏ మృదంగిస్టుకైనా ఆపుకోలేనంత ఉబలాటం కలుగుతుంది. అదుగో, కోపం తెచ్చుకుంటే మీ మీదొట్టు' అన్నాడు అగ్గిరాముడు.



'నా ప్రాణానికే పెట్టినా, నీ ఐడియా బాగానే ఉంది కాని, గురుద్రోహం అనరుట్రా, పీనుగా? మీ గురువు గారసలే తిక్క మనిషి. ఆయన వొప్పుకు చావొద్దూ?' అన్నాడు ఏకం.

'ఆయన మాటలా ఉంచండి, గురువమ్మగారు వప్పుకోవడం అసలు కుదరదు' అన్నాడు అగ్గిరాముడు.

'అవున్రోయ్! ముందు, నన్నే గుండు గొరిగించుకుని, దాని మీద మద్దెలో మరొహటో వాయించుకోమని, ఆ పని నాచేతే చేయిస్తారావిడ. గురువమ్మగారిది చండశాసనం. మరెవరిదేనా సెంటుపర్సెంటు బట్టతల దొరుకుతుందేమో చూడగలవూ?' అన్నాడు ఏకం.

'యడ్వర్టైజుమెంటివ్వాలి. రెండు మూడు వేలు అవుతుంది. ఆపైన గుండు హనుమంతు డెంతడుగుతాడో?' అన్నాడు అగ్గెన్న.

'యెంత డబ్బయినా, పబ్లిక్కు నుంచే వసూలు చేదాం. ఇదంతా ఎవరి కోసం? ఫండు పేరేడేనా చూడు. దొరికితే గనక, రెండు గుండులు మాటాడి, తబలా సోలో కూడా ఏర్పాటు చేయొచ్చు. భావ సమైక్యత కోసం అని లెక్చరివ్వచ్చు. మంత్రి గార్ని చీఫ్ గెస్టుగా పిలుద్దాం, ఏమంటావ్?'

'అలాగేను. కాని బట్టతలని మృదంగం అనడం కంటే, ఘటం అంటే కరెక్టుగా ఉంటుంది. అసలు మనుషుల్నే ఘటాలంటారు. మొండి ఘటం. శతమొండి ఘటం. పిరికి ఘటం ఇలాగ. అంచాతను. బట్టతలని ఘటం అనడమే కరెక్టు. మరొక ఉపాయం. ఖర్చూ తగ్గుతుంది. సులభంగానూ పనవుతుంది. పెద్ద గుండంత కుండ. దానికే కళ్ళూ, నోరూ వగైరాలు దిద్ది, మనిషే నన్పెప్పి కింద బుట్టబొమ్మ ఒకటి పెట్టి, వాయించేస్తే ఎలా ఉంటుందంటారూ?'

'భేష్! బాగుంది నీ ఐడియా. మరిహ ఆలస్యం యేల? లెటజ్‌గో యెహెడ్' అన్నాడు ఏకం.

'అగ్నితుండు - సజీవ ఘటం - గ్రాండ్ యుగళ్‌బందీ ఫర్ రెయిన్ వెల్కమ్ - హనుమాన్ మందిరం - శనివారం సాయంత్రం ఆరుకి - అందరూ ఆహ్వానితులే - వర్షయజ్ఞానికి ధారాళంగా విరాళం ఇచ్చి, జననీ జన్మభూమి రుణం తీర్చుకోండి - సెకండ్ కేష్ వోస్లీ టు 'ముక్కువైణికాగ్రేసర, ఏకాంబరం' అని పేపర్లు పంచి పెట్టించేశారు.

అగ్నితుండేమిటి? సజీవ ఘటమేమిటి? అని కుతూహలపడిపోతూ, తండోపతండాలుగా హనుమాన్ మందిర ప్రాంగణంలో జనం పోగయ్యారు. తుండు అంటే అదొక రకం డప్పు. తుండు దెబ్బ, దండోరా దెబ్బ అని ఆ మధ్య ర్యాలీలు నడిచాయి అన్నారొహరు. అగ్నితుండంటే ఆయుర్వేదం మాత్రం. సజీవ ఘటం అంటే బతికున్న మనిషే. ఇదో విచిత్రం. చూసొస్తే పోలా అని మరి కొందరు ఇలా అనుకునే, మంది విపరీతంగా పోగయ్యారు. బయటపెట్టిన విరాళాల డబ్బాలు చిల్లర నాణాల్తో, నోట్లతో నిండిపోయాయి.

సప్తతాళాలు ధ్రువ మఠ్య రూపకఝ్ఛ... అని, ఆ తరువాత పేర్లే మరిచిపోయిన ఏకం ఘటం సోలో ఎలాగూ వాయించలేడన్నది అగ్గిరాముడికి తెలియంది కాదు. ఖాళీ అగ్గిపెట్టెల మీద సోలో తనే వాయించేసి, ఏకాన్ని సర్వ లఘువులో ఘటం మీద లయ మాత్రం అందిస్తే చాలన్నాడు. తాళం వెయ్యడానికి సన్నాయి మేళం కన్నయ్యపిళ్ళైని అడిగి, కంచి కంచు తాళాలు వాయించే కుర్రవాణ్ణి, మిఠాయీ అవీ బాగా తినిపించి, తీసుకొచ్చేరు. కన్నయ్యపిళ్ళైని అధ్యక్షునిగా, కల్చరల్ మినిస్టర్ని ముఖ్య అతిథిగా పిలిచారు.

కన్నయ్య పిళ్ళే హనుమాన్ మందిరం ఆస్థాన విద్వాంసుడు. దక్షిణాది పిళ్ళై, జనానికి అతని మీద గౌరవం. ఈ ప్రాంతాన్ని సన్నాయి కావాలంటే, అతగాడి మేళమే దిక్కు. ఒక బంగారం కడియం కూడా, స్వంత ఖర్చు కొంతా. వూరి 'పెద్దలు' సాయంతోనూ, తగిలించుకున్నది. జనానికి నమ్మకం కుదరడానికే... ఇలాంటి హంగులు కళాకారుడికి తప్పనిసరి కదా! అగ్గిరాముడు వాయిద్యం గురించి కన్నయ్య ఎరుగున్నవాడే. అగ్గిపెట్టెలైతేనేం? రెండు చేతుల్లో చెరొక అగ్గిపెట్టీ పెట్టుకుని, కుర్రాడు అదరగొట్టేస్తాడు.

అగ్గిరాముడెవరో లోగడ పరిచయం చేశా. బందరు వాస్తవ్యులు. అగ్గిపెట్టెల వాద్యంలో అఖండులు. కీర్తిశేషులు ఇమిటేషనాచార్లు గారు మాకు ముత్తాత వరస అని చెప్పుకుంటాడతగాడు. ఈ రోజుల్లో మిమిక్రీ అనేదాన్ని ఆ రోజుల్లో ఇమిటేషనాచార్లు గారు ఏ డాక్టరేట్లూ లేకుండానే, త్రిలింగ దేశం అంతా హోరెత్తించేశారు. అగ్గిరాముడిది వరంగల్ ప్రాంతం. గవర్నమెంటు కాలేజిలో మృదంగం డిప్లొమా పాసయ్యాడు. కచేరీ ఛాన్సులు లేక, ఒక హరికథా భాగవతారుతో పట్నం వెళిపొచ్చి, ఇక్కడే సెటిలయిపోయాడు. ఏకాంబరం ముక్కు వీణ కచేరీకి అగ్గిపెట్టెల పక్కవాద్యానికి కుదిరాడు. పూర్వీకుల వారసత్వం వదులుకోగలడా? రెక్కాడితేనే గాని డొక్కాడదు. ఆ రెక్క మృదంగం మీద ఆడితేనేం, అగ్గిపెట్టెల మీద ఆడితేనేం? పైగా ఇందంట వింత విద్యలకే బ్రహ్మరథం పడతారు.

ముక్కు వీణ కచేరీకి మృదంగం దొరక్క ఏకాంబరం కంగారు పడుతూంటే, ముక్కు వీణ కచేరీకి అగ్గిపెట్టెల పక్క వాద్యమే రైటనీ, కళాతృష్ణ అగ్గిరాముణ్ణి కుదిర్చాడు. అప్పణ్ణుంచీ, అగ్గిరాముడు ఏకాంబరాన్ని గురువుగారూ అంటూ ఖుషామత్తు చేస్తుంటాడు.

కళాతృష్ణ శ్రద్ధ, ఆసక్తి, ప్రతిభా అన్నీ వున్న సిసలైన సంగీత విద్యార్థి, ఏకాంబరం పోజుల గుట్టుమట్టులు సంగతి తెలిసినవాడూ, గురువమ్మగారికి బాగా నమ్మినబంటూను. ఆవిడ కోరినందువల్లనే, ఏకం మీద కళాతృష్ణ ఎపుడూ ఒక కన్నేసి ఉంటూంటాడు. అతగాడు మరీ రెచ్చిపోయినపుడు, గురువమ్మగారికి ఉప్పందించి, ఆవిడ సలహా మీద, ఏకం పన్నుగడలను, అపాయంలేని ఉపాయంతో పమ్ము చేస్తూ అతగాణ్ణి ప్రమాదాల్లో చిక్కుకోకుండా తప్పిస్తూండటం కళాతృష్ణ పని.

ఈ జుగల్‌బందీ ప్లాను కథంతా, ముందే అగ్గిరాముడి ద్వారా విన్న కళాతృష్ణ, కచేరీ రోజు సాయంత్రం అందరి కంటే ముందే వచ్చి, ముందు వరసలోనే కూచున్నాడు. అన్ని పక్కలా హంగుదార్లని కూడా సిద్ధంగా కూచోపెట్టుకుని.

కచేరీ మొదలైంది. రెండు ఎర్ర కుండలకి, కళ్ళూ, నోరూ, పెయింటింగు చేయించి, ముందు పెట్టుకుని, ఏకం తబలా సోలో మొదలుపెట్టాడు. హిందుస్తానీ తబలా బోల్సు ముందే రికార్డు చేయించి, ఎవరికీ కనిపించకుండా టేపు రికార్డు వెనకాల పెట్టించుకుని, ఏకాంబరం లిప్ మూవ్‌మెంట్స్ మాత్రం ఇస్తూ, అప్పుడప్పుడు మనిషి తలకాయల్లా కనిపించే కుండల మీద జెల్లకాయల్లాంటి దెబ్బలూ, గుమ్కీలూ వేస్తుండగా, అగ్గిరాముడు అగ్గిపెట్టెల మీద జనప్రియమైన తబలా వరసలు ఒక పది ఇరవై వాయించేటప్పటికి, కళాతృష్ణ లీడింగుతో హంగుదార్లు తప్పట్లు దడదడ లాడించేశారు. ఈ కచేరీకొచ్చి 'చేతి' సాయం చైమని, అగ్గిరాముడి సలహాపై, ఏకాంబరమే మర్యాదగా వెళ్ళి, కళాతృష్ణని పిల్చుకొచ్చాడు. అతడి అభిప్రాయం అర్థమయ్యే, కళాతృష్ణ మందీ మార్బలంతోనే వచ్చాడు.

ఇహ కర్ణాటక తాళ వాద్య యుగళ బందీ మొదలైంది. ఏకం, అగ్గిరాముడు చెప్పినట్టుగానే, పైకి ఏ మాత్రం తెలియకుండా, సర్వ లఘువు వరసలు. తకధిమి, తకధిమి అనుకుంటూ, వాయించేస్తున్నాడు. ఆ పక్క నుంచి అగ్గిరాముడు. అగ్గిపెట్టెల మీద సప్తతాళాలూ, గతి భేదాలూ, చాంతాడంత పొడుగు ముక్తాయిలూ, వాయించే, 'తగ్గింపులు' స్టేజీ దగ్గరకొచ్చారు. ఏకాంబరం వాయించినపుడు అతగాడు 'జాగా'కి రాలేక చేతులెత్తేసే టైముకి, అగ్గిరాముడే కల్పించుకుని, ముగింపు తనే వాయించేస్తూ, ఎలాగో 'మొహరా ముక్తాయి' స్టేజీకి వచ్చారు. అనగా చిట్టచివరి క్లైమాక్సు స్టేజీ అన్నమాట. ఇంతవరకూ వచ్చిందంటే, అది పూర్తిగా అగ్గిరాముడి చాకచక్యమేను. అంతకుముందే, వారం రోజులు, రాత్రనక పగలనక, ప్రాక్టీసు చేయించిన మొహరా ముక్తాయి, సమయానికి ఏకాంబరానికి గుర్తురాలేదు. అసలుకి అవి బొమ్మలైనా, ఏకాంబరం అవలయ భరించలేక, ఘటాలకి కూడా కళ్ళు తిరిగిపోతున్నాయి. కళాతృష్ణ తాళం వేస్తూ, హుషారిస్తూనే ఉన్నాడు. అపుడప్పుడు, తధిగిణత, తధింగిణత, తద్దింగిణత, అని 'కొనక్కోలు' కూడా నోటితో చెపుతూ, ప్రాంప్టింగూ ఇస్తూనే ఉన్నాడు.

ఆహా, విల్వాద్రి అయ్యరూ, ఏకమ్మా వినాయక రామునీ కూడా ప్రత్యక్షం చేసేస్తున్నాడీ చిన్నవాడు. వాళ్ళలాగే, ఘటం గాలిలోకి కూడా ఎగరేస్తాడేమో చూడాలి, అన్నాడు. ఈ బ్యాగ్రౌండేమీ తెలీని ఒక అమాయక ప్రేక్షకుడు.

ఈ తప్పట్లకీ, సెభాషులకీ, వొళ్ళు మరిచిపోయి, ఏకాంబరం వొక్క ఉదుటున ఘటం గాలిలోకి ఎగరేసి, మళ్ళీ చేత్తో పట్టుకోబోయాడు. కాని అది చేతికి అందక, కిందపడి ముక్కలైంది. ఇంకేవుంది? 'సజీవ ఘటం' బండారం కాస్తా బట్టబయలైంది. జనం గగ్గోలు. కల్చరల్ మినిస్టరుగారు, చీఫు గెస్టు కదా! పోలీసు బందోబస్తు రెడీగా ఉంది. సమయానికి ఆదుకుని, అల్లరిని అదుపులో పెట్టారు. నిండా నిండిన చందాల డబ్బాలు చేత పుచ్చుకుని, కొందరు దుండగులు ఉడాయించాలనుకున్నారు. కళాతృష్ణ సమయజ్ఞతతో ఆ ప్రయత్నాన్ని పోలీసులు వమ్ము చేశారు. ఈ వినూత్న కార్యక్రమానికి కళాకారుల్ని అభినందించి, ఐదువేలు పైచిలుకు కలెక్టయిన మొత్తాన్ని సీఎం ఫండులో జమ చేయించి రసీదు పంపే బాధ్యత కల్చరల్ మినిస్టరు తన పి.యే.కి అప్పగించారు.

ఏకానికి మిగిలింది మర్నాడు పేపర్లో ఒక పొడి వార్త. ఒక విలేకరి మాత్రం సజీవ ఘటం గాలిలోకి ఎగిరి, కిందపడి చెక్కలవడం గురించి రాస్తూనే, ఇది కూడా ఏకాంబరం నిధుల వసూళ్ళ కోసం పన్నిన తమాషా వ్యూహమేనని చమత్కరించాడు. కళాతృష్ణ ప్రాంప్టింగ్‌తో, కుండపెంకుల సీను ఫొటో వెయ్యలేదు. నయమేను. ఏకం పేరుతోపాటు, సంగమయ్య గురువుగారి పేరు కూడా వేసినందుకు గురువమ్మగారూ సంతోషించారు.

★

**(6వ పేజీ తరువాయి)**

40 ఏళ్ళ క్రితం తెలుగుదేశంలో ఈ మాట్నీ సినిమాలు ఉండేవి కావు. అప్పుడు జనానికి అంత సినిమా పిచ్చి కూడా వుండేది కాదు. ఇదిగో ఈ కుహనా ధనవంతులు లేచి సినిమా సంస్కృతిని ప్రజల్లో మెల్లగా ఇంజెక్ట్ చేశారు. బెంగాల్ వాళ్ళకి ఇలాంటి సినిమా పిచ్చి లేదే... అందుకే అక్కడ స్పోర్ట్స్ అంతగా అభివృద్ధి చెందాయేమో ఆలోచించాలి! ఏడాదికి అప్పుడూ ఇప్పుడూ 50 చిత్రాల్నే తీస్తున్నారు బెంగాలీ వాళ్ళు. 'గంగిగోవు పాలు గరిటడైనను చాలు' అన్నట్టు ఒక సత్యజిత్‌రాయ్, ఒక రిత్విక్ ఘటక్... ఒక మృణాల్‌సేన్ లాంటి వాళ్ళ చిత్రాలే ఈనాటికీ ప్రథమ బహుమతులు పొందుతున్నాయి. ఆ స్థానాన్ని మనం ఆక్రమించగలమా? ఆంధ్రులు మళ్ళీ క్రీడల్లో పూర్వపు శోభను పొందాలంటే ఏ స్కూలుకి, ఏ కాలేజికి ప్లేగ్రౌండ్ అనేది లేకపోతే వాటిని నడపడానికి అనుమతిని ఇవ్వకూడదు. క్రీడల మంత్రిగా క్రీడల నేపథ్యం నుండి వచ్చిన వ్యక్తి అయితే మంచిది. వీళ్లపై సినిమా ప్రభావం లేకుండా మరియు ప్రలోభాలకు లొంగని వ్యక్తిత్వం వుంటే చాలామంచిది. వీళ్ళు క్రీడలకు కూడా సినిమా వాళ్ళని రప్పించకుండా... వాళ్ళ పనేదో వాళ్ళు చేసుకుంటే మరీ మంచిది.

★